ప్రజాశక్తి

బుధవారం 16 అక్టోబర్ 2024 5

శ్రీ సత్యసాయి

అత్యాచార నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం

◆ 'అనంత'కు టిజి.భరత్

◆ సత్యసాయికు అనగాని సత్య ప్రసాద్

టిజి.భరత్

అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. ఈ మేరకు మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాకు పరిశ్రమలు, వాణిజ్య ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్‌ను నియమించింది. సత్యసాయి జిల్లాకు రెవెన్యూ, స్టాంపుల రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నియమించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులను ఇతర జిల్లాకు నియమించింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నంద్యాల జిల్లాకు, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను కడప జిల్లాకు, వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌ను ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించింది.

సమన్వయం సాధించేరా ?

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తుంది. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు నియమించిన ఇద్దరు మంత్రులు కీలక శాఖలకే మంత్రులుగా ఉన్నారు. ఇన్‌చార్జులు అటు పార్టీని, ఇటు అభివృద్ధి పనులను సమన్వయం చేసుకుంటూ ముందుకుపోవాల్సి ఉంటుంది. అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రిగా నియమితులైన టిజి భరత్ పక్క జిల్లా కర్నూలుకు చెందిన వారు. ఆయనకు ఇక్కడి సమస్యలపై కొంత మేరకు అవగాహన ఉండే అవకాశముంది. సత్యసాయి జిల్లాకు సంబంధించి గుంటూరు జిల్లా రేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అనగాని సత్య ప్రసాద్‌ను నియమించారు. ఈయనకు ఇక్కడి రాజకీయ పరిస్థితులు కొంత కొత్త కావచ్చు. అంతేకాకుండా ఇక్కడున్న నాయకులందరూ సీనియర్లు కావడమే కాకుండా ఆ జిల్లా పరిధిలో ఇద్దరు మంత్రులు ఉన్నారు. పార్టీలోనూ ముఖ్య నేతల మధ్య కొంద దూరం ఉంది.వీటన్నింటినీ ఇన్‌ఛార్జి మంత్రి సమన్వయం పరచి ముందుకు తీసెకెళ్లాల్సి ఉంది.

జిల్లా అభివృద్ధి గాడిన పెట్టేరా ?

జిల్లా అభివృద్ధిని గాడిలో పెట్టే ప్రధాన బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులపై ఉంటుంది. ఇందుకు వారు బాధ్యతలు తీసుకున్న తరువాత జిల్లా అభివృద్ధి (డిఆర్‌సి) సమీక్షలు జరపాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లా అభివృద్ధి సమీక్షలు ఇంకా జరగలేదు. సత్యసాయి జిల్లా వరకు ఇద్దరు మంత్రులు జిల్లా పరిస్థితులు తెలుసుకునేందుకు ఒక సమీక్ష నిర్వహించారు. అనంతపురం జిల్లాలో అటువంటి ప్రయత్నం జరగలేదు. ఇప్పుడు ఇన్‌ఛార్జి మంత్రులు రావడంతో వారి ఆధ్వర్యంలో సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి జరగాల్సి ఉంది.

చిరు జల్లులు

ప్రజాశక్తి-అనంతపురం

తుపాను ప్రభావంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంగళవారం నాడు తేలికపాటి వర్షాలు పడ్డాయి. నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు పడుతాయని రెండు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తమై ఉన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యాప్తంగా మంగళవారం నాడు తేలికపాటి వర్షాలు పడ్డాయి. చిరు జల్లులు పడ్డాయి. 0.4 మిల్లిమీటర్లు, సత్యసాయి జిల్లాలో 9.4 మిల్లీమీటర్లు నమోదయింది. యల్లనూరులో అత్యధికంగా 3.2 మిల్లిమీటర్ల వర్షం పడింది.

వర్షాలపై అప్రమత్తం : కలెక్టర్

పుట్టపర్తి రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వర్షాలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగాలని కలెక్టర్ టిఎస్.చేతన్ జిల్లా, మండల అధికారులకు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేస్తూ పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15, 16వ తేదీల్లో అధిక వర్షాలు ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపిందన్నారు. వాగులు, వంకలు, కాలువలు, నదులు, ఎక్కడైనా ఉపనదుల గట్టులు ఉంటే వాటిని పరిశీలించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలు, పశువులను ఎగువ ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లాలో ఉన్న చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యం తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా గట్లు తెగి వరద, ఉప్పెన వస్తే వెంటనే జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల రోజువారీ జీవన విధానానికి ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఈదురు గాలులు, వర్షాల వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 08555-289039 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్‌లో 24/7 సిబ్బంది అందుబాటులో ఉంటుందన్నారు.

విద్యాసంస్థలకు నేడు.. రేపు సెలవులు

భారీ వర్షాల సమాచారం నేపథ్యంలో జిల్లాలో బుధు, గురువారాల్లో అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల సూచన నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

అత్యాచార నిందితులు అరెస్టు

◆ ఐదుగురు అరెస్టు.. పరారీలో ఒకరు.. నిందితుల్లో ఇద్దరు మైనర్లు

◆ స్పెషల్ కోర్టు ద్వారా నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చూస్తాం

◆ శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం నల్లబొమ్మానిపల్లి వద్ద ఇటీవల చోటు చేసుకున్న అత్తాకోడళ్లపై అత్యాచార ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి, హోం మంత్రి, డిజిపి ఆదేశాలతో ఘటనను తీవ్రంగా పరగణించిన జిల్లా పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలించారు. సమీప ప్రాంతాల్లో సిసి పుటేజ్ ద్వారా నిందితుల ముఖచిత్రాలను గుర్తించి నాలుగు ప్రత్యేక పోలీస్ బందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుల జాడ తెలుసుకొని 48 గంటలలోపే వారిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం నిందితుల అరెస్టు, వివరాలను హిందూపురం 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మహేష్‌తో కలిసి ఎస్పీ వి.రత్న విలేకరులకు వెల్లడించారు. హిందూపురం పట్టణం త్యాగరాజ నగర్‌కు చెందిన ఎరికల కావడి నాగేంద్ర ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడు. ఇతనిపై పలు పోలీసు స్టేషన్లలో 37కు పైగా కేసులు ఉన్నాయి. ఇతనితో పాటు హిందూపురానికి చెందిన సాకే ప్రవీణ్‌కుమార్, చాకలి శ్రీనివాసులు, మరో ముగ్గురు మైనర్లు ఈ అకృత్యంలో పాల్గొన్నారు. ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి నిందితుల కోసం గాలించారు. అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు ప్రధాన నిందితులు నాగేంద్ర, ప్రవీణ్‌కుమార్‌తో పాటు ముగ్గురు మైనర్లను హిందూపురం -పాలసముద్రం రోడ్డు పక్కన గల బిట్ కాలేజీ వెనుక వైపున డంపింగ్ యార్డ్ వద్ద అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక మొబైల్, రెండు ద్విచక్రవాహనాలు, రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో చాకలి శ్రీనివాసులు పరారీలు ఉన్నాడు. త్వరలో ఇతన్నీ అరెస్టు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులపై కఠినంగా వ్యవహరిస్తామని ఆమె హెచ్చరించారు. ఘటన జరిగిన 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి, క్యాష్ రివార్డులను అందించారు. ఈ సమావేశంలో హిందూపురం సిఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, జనార్ధన్, రాజగోపాల్ నాయుడు, ఎస్‌బిఐ ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం ప్రభుత్వ ఆసుపత్రిలో సూదిమందు కరువు

కుక్కకాటుకు బయట నుంచి ఇంజక్షన్ తెచ్చుకోవాల్సిందే

మాత్రలతోనే సరిపెడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - రొద్దం

రొద్దం ప్రభుత్వ ఆసుపత్రిలో సూదిమందు కరువైంది. ఆసుపత్రిలో ఇంజక్షన్లు లేకపోవటంతో బయట నుంచి తెచ్చుకోవాలని సిబ్బంది రోగులకు చెబుతున్నారు. దీంతో కొందరు రోగులు డబ్బు పెట్టి తెచ్చుకోలేక మరికొందరు అరకిలోమీటరు దూరంలో ఉన్న మెడికల్ షాపునకు వెళ్లి తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యసిబ్బంది రోగులకు కేవలం మాత్రలు ఇచ్చి పంపుతున్నారు. గత శనివారం మండలంలోని ఆర్. మరవపల్లికి చెందిన ఒక మహిళకు కుక్క కరవడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. అక్కడి సిబ్బంది ఆసుపత్రిలో టీటీ ఇంజక్షన్ లేదని బయట తెచ్చుకోవాలని సూచించారు. దీంతో వారు మెడికల్ దుకాణంలో కొనుగోలు చేసి వేయించుకున్నారు. ఇలా ప్రభుత్వ ఆసుపత్రికి పలు రోగాలతో వచ్చిన బాధితులకు మాత్రలు మాత్రమే ఇచ్చి పంపుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో వైద్యానికి ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు వాపోతున్నారు. అత్యవసర సేవలైన రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్య కేసులు ఏవైనా ఆసుపత్రికి వస్తే ఎలా చేపడతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై వైద్యాధికారులతో సమాచారం కోరగా పైనుంచి మందులు రావడంలేదని చెప్పారు.

రొద్దం ప్రభుత్వ ఆసుపత్రి భవనం

రాఘవేంద్ర హోటల్ వద్ద అధికారుల హల్‌చల్

◆ నిబంధనలు పాటించలేదంటూ నోటీసులు

◆ భవన యజమానికి కూడా.. ◆ మద్యం లాటరీనే కారణమా..?

రాఘవేంద్ర హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

పట్టణంలోని జూనియర్ కళాశాల రోడ్‌లో ఉన్న రాఘవేంద్ర హోటల్ వద్ద మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారుల హడావుడి కొనసాగింది. మున్సిపల్ అధికారులందరూ మూకుమ్మడిగా హోటల్ వద్దకెళ్లి తనిఖీలు చేశారు. కమిషనర్ వంశీకష్ణ భార్గవ్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అలీఖాన్, విఆర్ఒ గంగాధర్‌లు పోలీసులతో కలిసి హోటల్‌ను క్షణ్ణంగా తనిఖీ చేశారు. పారిశుధ్యంతోపాటు హోటల్ నిర్వహణకు ట్రేడింగ్ లైసెన్స్ పొందలేదన్న కారణంతో యజమాని దినేష్‌కు నోటీసులు జారీ చేశారు. హోటల్ భవన యజమాని వెలుగు శ్రీనివాస్ మిద్దెపై మున్సిపల్ అనుమతి లేకుండా పెంట్‌హౌస్ నిర్మించడంపై వివరాలు తీసుకున్నారు. నిబంధనల మేరకు భవన నిర్మాణం జరిగిందా.. లేదా అన్న దానికి సంబంధించిన అన్ని పత్రాలూ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. సరైన పత్రాలు ఇవ్వకుంటే భవనాన్ని కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

మద్యం లాటరీనే కారణమా..?

మద్యం టెండర్లకు సంబంధించి సోమవారం నిర్వహించిన లాటరీలో ఓ షాపు నిర్వహణకు రాఘవేంద్ర హోటల్ యజమాని దినేష్‌కు లాటరీ తగిలింది. లాటరీ టోకెన్ తమకు ఇచ్చేయాలంటూ నియోజకవర్గం ముఖ్యప్రజాప్రతినిధి సమీప బంధువు, కంబదూరు మాజీ ఎంపీపీ ఒకరు దినేష్‌ను బెదిరించినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణానికి దరఖాస్తు చేస్తే తనకు వచ్చిందని, తాను టోకెన్‌ను ఇచ్చేది లేదంటూ దినేష్ వారికి తెలియజేసినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాన్ని వదులుకోలేదన్న కారణంతో అధికార పార్టీ నేతలు అతనిపై వేధింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అందులో భాగంగానే ఎప్పుడూ లేని విధంగా హోటల్‌పై మున్సిపల్ అధికారులు మూకుమ్మడి తనిఖీలతో బెదరగొడుతున్నారని దినేష్ మీడియా ఎదుట వాపోయాడు.

ప్రశ్నలు రేకెత్తించే కథలు రచించాలి

పుస్తకావిష్కరణ సభలో రచయితలు

ప్రజాశక్తి-హిందూపురం

కవులు, రచయితలు ప్రశ్నలను రేకెత్తించే కథలు రచించాల్సిన అవసరం ఉందని కవులు, రచయితలు అన్నారు. పట్టణంలోని ఎన్ ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి రాసిన 'కొన్ని చీకట్లు ఓ వెలుతురూ' పేరుతో వెలువడిన కథా సంపుటిని రచయిత సడ్లపల్లి చిదంబర్ రెడ్డి మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ హాజరై ప్రసంగించారు. కౌమార దశ దాటి అప్పుడే యవ్వనంలోకి అడుగుడుతున్న ఆశవాహ యువతులు కొత్త తరానికి రెక్కలు సాచి ఎగరడానికి లక్ష్యం వైపు పయనిస్తున్న క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను రచయిత వివరించిన తీరు అమోఘమనిఅన్నారు. కుల గౌరవాలు, కట్టుబాట్ల పేరుతో జరిగే బలవంతపు పెళ్లిళ్ల, బాల్య వివాహాలు, వివిధ రకాల ప్రలోభాలతో జరిగే మోసాలు తదితర సమస్యలన్నింటినీ సవాళ్లుగా ఎదిరించి జీవిత ప్రగతి పథంలో ఏ విధంగా ముందుకు దూసుకెళ్లాలో తన రచనలో రచయిత రచించిన విధానం స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు సిద్ధగిరి శ్రీనివాస్, పుస్తక ప్రచురణకర్త అరుణాంక్, రచయితలు కల్లూరి రాఘవేంద్రరావు, శొంఠి జయ ప్రకాష్, చైతన్య గంగిరెడ్డి, చింతా గంగిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డాక్టర్. అశ్వర్థ నారాయణ, దేవిశెట్టి రామన్న, జి. అశ్వర్థరెడ్డి, రచయిత్రి మాడుగుల సులోచన, రూపలేఖ, కళాశాల పూర్వ విద్యార్థి ఎం ఆర్. కవిత, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, కళాశాల సిబ్బంది యశోద, భోజప్ప, రవినాయక్, పార్వతి, సుమంగళి, అశ్వర్థప్ప, సుబ్బరాయుడు, రంగనాయకులు, బాలరెడ్డి, శశికుమార్, కళావతి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఖైదీల కదలికలపై నిరంతరం నిఘా

జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

ప్రజాశక్తి-హిందూపురం

వివిధ నేరాలు చేసి జైళ్లకు వచ్చే ఖైదీల పట్ల నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. మంగళవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉప కారాగారంలో ఉన్న ఖైదీలు ఏయే నేరాలు చేసి జైలుకు వచ్చారు, ఆయా ఖైదీలకు న్యాయవాదులు ఉన్నారా లేదా అన్న విషయాలను జైలు అధికారి అంజి నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. వైద్య సహాయం సకాలంలో అందుతుందా, నాణ్యమైన ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారా, జైలులో ఏమైనా ఇబ్బందులకు గురవుతున్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ పరంగా పరిశీలించి ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. జైలుకు రావడం వల్ల కుటుంబ మర్యాద దెబ్బ తినడంతో పాటు ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, జైలు నుండి బయటకు వెళ్లిన తర్వాత ప్రవర్తన మార్చుకుని మెలగాలని సూచించారు. అనంతరం జైలు గదులు, వంటగది, శుద్ధ నీటి ప్లాంట్ తదితర వాటిని పరిశీలించారు. స్థానిక ఉపకారాగారంలో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఉంటాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన నిఘా నేత్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ కోసం ప్రత్యేకంగా ఉప కారాగారంలో ఓ గదిని ఏర్పాటు చేయాలని ఉప కారాగారాధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

జైలు అధికారికి సూచనలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

భూ కుంభకోణంపై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి కథనానికి స్పందన

వివరాల సేకరణలో అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం హిందూపూర్ రోడ్డులో ఉన్న భవన నిర్మాణ కార్మికసంఘానికి చెందిన భూమి కుంభకోణంపై కలెక్టర్ ఆరా తీసినట్లు సమాచారం. ఆభూమిలో పట్టాల విషయంలో చోటు చేసుకున్న భాగోతంపై మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో కార్మికుల (పే)రుతో ప్రభుత్వ భూమి హాంఫట్ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం పై జిల్లా కలెక్టర్ స్పందించినట్లు తెలుస్తోంది. ఈ భూమి విషయంపై సమగ్ర నివేదికను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో అధికారులు ఈ భూమికి సంబందించిన వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మద్యం షాపులు దక్కించుకున్న వారికి బంపర్ ఆఫర్లు..!

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మద్యం టెండర్ల లాటరీలో వ్యక్తిగతంగా దుకనాలు దక్కించుకున్న వారికి లాటరీలో షాపులు దక్కని వారు బంపర్ ఆఫర్లు ఇస్తున్నారు. మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇఎస్ కార్యాలయం వద్ద షాపులు పొందిన వ్యక్తులు తమ వ్యక్తిగత డాక్యుమెంట్లు అందజేయడానికి వచ్చారు. వారిలో వ్యక్తిగతంగా వైన్ షాపులు దక్కించుకున్న వారితో అధికార వర్గానికి చెందిన వారు మంతనాలు జరుపుతున్నారు. షాపులను దక్కించుకోవడానికి బంపర్ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. పుట్టపర్తి మండలానికి చెందిన నాలుగు షాపులలో ఒకటి కొత్తచెరువుకు చెందిన ఒక వ్యక్తి లాటరీలో దక్కించుకున్న వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు తెలిసింది. వారే మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. దుకాణ నిర్వహణ కోసం దాదాపు 40 లక్షలు ఖర్చు చేయాల్సి ఉండగా అంత స్తోమత లేని వారు ఇతరులకు సిండికేట్ల ఒత్తిడి మేరకు షాపులను వదిలేసుకుంటున్నారు. మరి కొంతమంది గుడ్ విల్ కింద నెలకు కొంత మొత్తాన్ని అప్పజెప్తామంటే షాపులను వదులుకోలేక ఆలోచనలు పడ్డారు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 87 మద్యం షాపులకు గాను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక నిర్వహించారు. ఈనెల 16 నుండి నూతన షాపులలో మద్యం విక్రయాలు జరగనున్నాయని దానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అధికారులు తెలిపారు. నిర్వాహకులకు లైసెన్స్, మంజూరు, మిగిలిన తంతును పూర్తి చేసి ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నోరు మెదపని అధికారులు

మండలమీట్‌లో సభ్యుల ఆగ్రహం

చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో కూటమి నేతల సహకారంతో కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తూ రైతుల పొట్ట కొడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా అధికారులు నోరు మెదపడంలేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు. తంబాపురం సర్పంచి సానే జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డితో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ కొందరు చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వీరు ఇసుకను తరలిస్తున్న సమయంలో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని తద్వారా ఆ రహదారిలో ప్రయాణిస్తున్న వారు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. మండలంలో ఇసుక రీచ్ గాని, స్టాక్ పాయింట్ లేకున్నా ఇష్టారాజ్యంగా ఇసుకను తదలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. అధికారులకు ఫోన్ చేస్తే వారు కూడా ఇప్పుడు తాము ఆ విధుల్లో లేమంటూ సమాధానమిస్తున్నారన్నారు. ఎవ్వరికి చెప్పినా ప్రయోజనం లేదని, తామే అడ్డుకుందామంటే గొడవలు జరుగుతాయని, తమపైనే అక్రమ కేసులు పెడుతారని వెనకడుగు వేస్తున్నామని సభ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి 8 గంటలు దాటితే వందలాది ట్రాక్టర్లు చిన్నచిగుళ్లరేవు, గరికలపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఇసుకను తీసుకువెళ్లేందుకు వచ్చేవారు మద్యం తీసుకువచ్చి విందులు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. అలాంటి వారు దాడులకు, ఆత్యాచారాలకు పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. స్పందించిన తహాశీల్దార్ స్వర్ణలత మాట్లాడుతూ తాము వివిధ పనులపై ఆర్టీవో కార్యాలయంలోనే అధిక సమయం వెచ్చిస్తున్నట్లు వివరించారు. పోలీసులు పట్టుకున్న వాహనాలకు జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉదయం పట్టుపడిన వాహనాలు సాయంత్రం రెవెన్యూ అధికారులు వేసే జరిమానాలు చెల్లించి తీసుకువెళ్లిపోతున్నారన్నారని అలా కాకుండా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. చిత్రావతి నది నుంచి రామాపురం, తంవాపురం, నార్శింపల్లి, వెంకటగారిపల్లి, లింగారెడ్డిపల్లి మీదుగా ప్రతి రోజూ వందలాది ట్రాక్టర్లు వెళ్లుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కోటి సుధ, శాశ్వత ఆహ్వానితుడు గుర్రం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో నరసింహానాయుడు, ఇఒఆర్‌డి కిష్టప్పతో పాటు ఆయా శాఖల అధికారులు సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

మండలమీట్‌కు హాజరైన సభ్యులు

ప్రజాశక్తి
www.prajasakti.com

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - నల్లచెరువు

సచివాలయ సిబ్బంది విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఎల్‌డిఒ పోలప్ప హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రంలోని సచివాలయం-2ను ఎంపీడీవో రఘునాథ్ గుప్తాతో కలిసి తనిఖీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ విధులకు డుమ్మా కొట్టడంపై డిఎల్‌డిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూమెంట్ రిజిస్టర్‌లో సరైన వివరాలు తెలపకపోవడం ఏమిటని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్డీవోను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇటీవల బాధ్యతలు చేపట్టి పుట్టపర్తి ఆర్డీవో సువర్ణను తెలుగుదేశం నాయకులు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మండల కన్వీనర్ రామాంజనేయులు మాజీ పుడా చైర్మన్ కడియాల సుధాకర్ నాయుడు, రాష్ట్ర ముస్లిం మైనారిటీ విభాగపు కార్యదర్శి మహమ్మద్ రఫీ, అంబులెన్స్ రమేష్ ఆమెకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - మడకశిర

రైతులు అధికారుల సలహాలు సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి తిమ్మప్ప తెలిపారు. మండల పరిధిలో ఏఆర్ రెప్పం, ఆముదాలగొంది గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్నిమంగళవారం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో కంది, మొక్కజొన్న, పత్తి పంటలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, అమర్నాథ్ రైతు సేవ కేంద్రం సిబ్బంది హిమబిందు, మమత, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సివిల్స్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో ఢిల్లీకు చెందిన ప్రముఖ సివిల్స్ కోచింగ్ సంస్థ డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ధర్మవరంలో మహిళలకు సివిల్స్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 20 న ఆదివారం సంస్కృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఆశావాహులకు సివిల్స్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆలయ భూముల వేలం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని బసవేశ్వర స్వామి దేవాలయానికి చెందిన భూముల్లో పంటసాగుకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సంజీవ రాయుడు తెలిపారు.ఉదయం 11 గంటలకు స్థానిక సత్య సాయి కళ్యాణమండపంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో మూడు సంవత్సరాల లీజుకు వేలం నిర్వహించబడుతుందని తెలిపారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బుక్కపట్నం

ప్రభుత్వ అందించే సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీడీ సుదర్శన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తకోట గ్రామపంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను ఉపయోగించుకుని లాభసాటి ప్రయోజనాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సనావుల్లా, ఎఒ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇఒఆర్‌డిగా గోవిందప్ప

ప్రజాశక్తి - రొద్దం

రొద్దం ఇఒఆర్‌డిగా గోవిందప్ప మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న కేశవరెడ్డి ఓబుళదేవర చెరువు మండలానికి బదిలీపై వెళ్లాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రొద్దం పంచాయతీ కార్యదర్శిగా ఉన్న గోవిందప్ప ఇఒఆర్‌డిగా అదనపు బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు బాబు, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, వినయ్, జనార్ధన్, రఫిక్, రాజశేఖర్, పద్మజ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

డీఎడ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఉమ్మడి జిల్లాలోని 2018 - 20 బ్యాచ్ కు సంబంధించిన డిఎడ్ విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రవి సాగర్ తెలిపారు. 2018 - 20 బ్యాచ్ స్పోర్ట్స్, మేనేజ్మెంట్‌కు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు నవంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా 2023 - 25 సంవత్సరం చెందిన రెగ్యులర్ విద్యార్థులకు, ఒకసారి ఫెయిల్ అయిన 2021 - 23, 2022 - 24 బ్యాచ్‌లకు చెందిన డిఎడ్ సెకండ్ సెమిస్టర్ విద్యార్థులకు నవంబర్ నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతాయని డైట్ ప్రిన్సిపల్ తెలిపారు.

మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు జెవి. రమణ, టి.అయూబ్ ఖాన్, ఎస్ వెంకటేష్, ఎం బాబు, ముకుంద మాట్లాడుతూధర్మవరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులుగా అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న నాగేంద్ర, మల్లికార్జున ఇటీవల మృతిచెందారన్నారు. వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంతో తోటి కార్మికులు వారి వంతు ఆర్థిక సాయాన్ని అందించారన్నారు. నాగేంద్ర కుటుంబానికి రూ.39,600, మల్లికార్జున కుటుంబానికి రూ.35,600ల నగదును అందజేశారు. ధర్మవరం మున్సిపాలిటీ అధికారులు స్పందించి మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటు లక్ష్మీ ఓబులేసు, పుల్లన్న, చేన్నకేశవ, పెద్దక్క, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు నగదు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జన సంరక్ష, పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టీ ఎస్ చేతన్ కోరారు. మంగళవారం పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వందశాతం లక్ష్యంతో బ్యాంకర్లు ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించే క్రమంలో జిల్లాలోని 467 గ్రామ పంచాయతీల్లో 2025 జనవరి జనవరి 15 వరకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోనేలా అవగాహన కల్పించాలని డిఆర్‌డిఎ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, పంచాయతీ అధికారి, ఎల్‌డిఎంలు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం ఎవి. రమణ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ సమత, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ , బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రీచ్ ల వద్దనే ఇసుక పొందవచ్చు

ప్రభుత్వ నిబంధనలు మేరకు జిల్లాలోని ఆయా రీచ్ ల వద్ద మధ్యాహ్నం 12 నుంచి సాయంకాలం 6 గంటల వరకు నేరుగా (ఆఫ్ లైన్)ఇసుకను పొందవచ్చునని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు.మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా ,భూగర్భ గనుల శాఖ కమిషనర్ ,డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో ఇసుక సరఫరా విషయమై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతూ వినియోగదారులకు కావలసిన ఇసుక సరఫరాకు సంబంధించి ఆయా రీచ్ ల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో బుధవారం నుండి బత్తలపల్లి మండలం సిసి. రేవు , ముదిగుబ్బ మండలం వద్ద ఉన్న పిపిసి రేవు పాయింట్లలో నేరుగా ఇసుకను బుకింగ్ చేసుకో వచ్చునని తెలిపారు. ఇసుక కావలసిన వినియోగదారులు తమ ఆధార్ కార్డుతో రీచ్ లు ఉన్న ప్రాంతానికి వెళ్లి వారి మొబైల్ నెంబరు , భవన నిర్మాణపు పనుల వివరాలు తెలియజేసి తమకు కావలసిన ఇసుకను అక్కడే బుకింగ్ చేసుకొని పొందవచ్చునని తెలిపారు. ఇసుక అవసరమున్న వినియోగదారులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

15 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ ఆదేశించారు. వయోజన విద్య అభివృద్ధిపై కలెక్టర్ వివిధ శాఖ అధికారులతో గూగుల్ మీట్ విధానం ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సవిత

అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-పెనుకొండ

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఏపీజే అబ్దుల్ కలాం చేసిన కృషి సాటిలేనిదన్నారు. శాస్త్రవేత్తగా, మాజీ రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈకార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసిలు మునిమడుగు వెంకట రాముడు, శ్రీనివాసులు, మాధవ నాయుడు, మండల పార్టీ కన్వీనర్ సిద్దయ్య, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు, రామకృష్ణ, షౌకత్, రఘువీరా చౌదరి, త్రివేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మాజీ రాష్ట్రపతి డాక్టర్. ఎపిజె అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన జీవితం ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, వెంకటేష్ , బాబు ప్రసాద్, లక్ష్మీనారాయణ రవికుమార్, ఈశ్వర్, రామాంజనేయులు, నరసింహులు , మారుతి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి, కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ హర్షవర్ధన్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల మధ్య కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు తీర్చిదిద్దడం కోసం ఆయన చేసిన కృషికి నివాళిగా ఆయన జయంతిని అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

వాల్మీకి జయంతిని జాతీయ పండుగగా గుర్తించి, జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని, వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి బోయ సంఘం రాయలసీమ ఇన్‌ఛార్జి బోయ సాంబ డిమాండ్ చేశారు. మంగళవారం బత్తలపల్లిలో వాల్మీకి బోయ సంఘం నాయకులతో కలసి మాట్లాడారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని, వాల్మీకి జయంతి రోజును జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని వాల్మీకి సోదరులు విజ్ఞప్తి చేశారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని వినతిని ఇచ్చామని దానిని మరుగున పెట్టి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి చేతులు దులుపుకోవడం విచారకరమని అన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను మభ్య పెట్టే ప్రకటనలు మానుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువత నాయకుడు చిన్నూర్ నరసింహులు, చింతకాయల నరేష్, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త నియోజవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్ర, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంట రమేష్, బాచి తదితరులు పాల్గొన్నారు.

15 మందికి ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రతినిధులు

పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ కళాశాలలో టైటాన్ ఐ ప్లస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 15 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వాహకులు బొగ్గు సురేష్ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభ్యర్థుల ఎంపికలో 15 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వీరికి వందశాతం జాబ్ ప్లేస్‌మెంట్ కల్పించినట్లు ఆయన తెలిపారు. మొట్టమొదటిసారిగా పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి వీరు ఎంపిక కావడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 2024- 25 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు కొరకు ఇంకా సమయం ఉందని ఆసక్తి కలిగిన వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీస్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ సభ్యులు డాక్టర్ బొగ్గు సురేష్, మురళి, జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ ఉష, రామరాజు, అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ మహేష్, టైటాన్ ఐ ప్లస్ సంస్థ సభ్యులు రాజారెడ్డి, మిథున్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న గ్రామీణ రోడ్ల కల : మంత్రి సవిత

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

రోడ్డు పనులను భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

తాడిమర్రిలో పల్లెపండుగలో అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - పరిగి

కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రోడ్ల కల నెరవేరుతోందని బీసీ సంక్షేమ జౌళి టెక్స్‌టైల్ శాఖ మంత్రి సవిత అన్నారు. మంగళవారం పరిగి మండలంలోని బీచిగానిపల్లి వంగలపల్లి పాత్రగానిపల్లి గొల్లపల్లి ఊటకురు గ్రామాలలో రూ..65 లక్షలతో నిర్మించబోయే కాలనీ రోడ్లకు మంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించి మంత్రిని చేశారని వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉండేదన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నోరు రోజుల పాలనపై విమర్శలు చేసిన వైసిపి నాయకుల పనితీరుపై ఆమె ఘాటుగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎన్ఆర్ఇజిఎస్ పీడీతో పాటు ఎంపీడీవో శ్రీధర్, తహశీల్దార్ హసీనా సుల్తానాతో పాటు ఆయా శాఖల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, సర్పంచి బాలాజీ, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, మారుతిప్రసాద్, తిలక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి నియోజకవర్గంలో 20 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పుట్టపర్తి మండలం పరిధిలోని పెడబల్లి, వెంకట గారిపల్లి , జగరాజు పల్లి పంచాయతీల్లో రూ. కోటి 10 లక్షలతో మంజూరైన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఉన్నారు. పల్లె పండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ,మాజీ మంత్రి కి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి మండలంలో మూడు కోట్ల రూపాయలతో గ్రామీణ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాల్లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని వైసిపి నేతలను ప్రశ్నించారు. అనంతరం పెడబల్లి ,సుబ్బరాయన పల్లి , వెంకటగారిపల్లి ,జగరాజుపల్లి లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయకుమార్, టీడీపీ నాయకులు శ్రీరామ్ నాయక్, బొమ్మయ్య, శ్రీరామ్ రెడ్డి, పుల్లప్ప, నాగరాజు, మహేష్, మురళి, కృష్ణారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసమే పల్లె పండుగ వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఛత్రం గ్రామ పంచాయతీ సి రంగాపురం, ఆర్ అనంతపురంలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు రంగేగౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, నరేష్ కన్న, శ్రీనివాసులు, నాగేంద్ర, రామాంజినేయులు, పాల రామాంజి, డ్రైవర్ రామాంజి, మాజీ సర్పంచి పాండురాజు, నంజుండ, నాగేగౌడుచ కమలాకర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని మోరుబాగల్ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తం, రాజన్న, రామప్ప, మైలారప్ప, సుదర్శన్, కుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి అన్నారు. మంగళవారం దేమకేతేపల్లిలో చేపడుతున్న సిసి రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, ఇఒఆర్‌డి భాస్కర్, టిడిపి నాయకులు బేకరి గంగాధర్, నందీశప్ప, ఆశ్వర్థప్ప, జనసేన నాయకులు చిన్నా ప్రవీన్ కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కదిరి రూరల్ ఎర్రదొడ్డి పంచాయతీ ఎరుకులవండ్లపల్లిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పోలప్ప అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మలకవారిపల్లిలో సిసి రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సావిత్రమ్మ, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా తదితర అధికారులు, నాయకులు సూర్యనారాయణ, ఆదినారాయణ, వీర, వెంకటరమణ, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గరిశనపల్లి గ్రామంలో రూ. 8 లక్షలు వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు అధికారులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ శ్రీరాములు, ఎంపీడీవో నరసింహనాయుడు, ఇఒపిఆర్‌డి పి.క్రిష్టప్ప, ఎపిఒ కె.ఆదెప్ప, పంచాయతీ కార్యదర్శి భారతి, సర్పంచి భాగ్యమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కాకర్ల సురేంద్ర, నాయకులు బాసిగొండ రవి, బాసిగొండ చిన్నా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో పల్లె పండుగ : తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చిల్లకొండయ్యపల్లి స్కూల్ నందు రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనికి,పెద్దకోట్ల గ్రామసచివాలయం ఆవరణములో రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలతో పాటు ఎపిడి వెంకటాచలపతి, ఎంపిడిఒ రంగారావు, ఇఒఆర్‌డి విజయ శేఖర నాయుడు, ఎపిఒ సంజీవరెడ్డి, మండల స్థాయి అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

లేపాక్షి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బిసలమనేపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేవారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగేంద్ర, టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, ఎంపీడీవో నరసింహ మూర్తి, ఇఒఆర్‌డి ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రూరల్ మండల పరిధిలోని మలగూరు, బీరేపల్లి తదితర పంచాయతీల్లో జరిగిన పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సరస్వతి, పిఆర్ ఎఇ లక్ష్మి నాయక్, ఎపిఇ లలిత కుమారి, సచివాలయ ఉద్యోగులతో పాటు మాజీ సర్పంచులు రషీద్, గోవిందప్ప, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీకేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మణిగే రంగయ్య నాయుడుకు చెందిన గొర్రెల చోరీ కేసులో నలుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు నల్లమడ సిఐ నరేందర్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12 తేదీన మిట్టపల్లి గ్రామానికి చెందిన మనిగే రంగయ్య నాయుడుకు చెందిన గొర్రెలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం కదిరి హిందూపురం ప్రధాన రహదారి లో కొత్త రోడ్డు వణుకు వారిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కొంతమంది గొర్రెలను ఆటోలో తరలిస్తుండగా విచారించామన్నారు. వీరే రంగయ్యనాయుడుకు చెందిన గొర్రెలను ఎత్తుకెళ్లినట్లు అనుమానం వచ్చి విచారించగా నేరం అంగీకరించారన్నారు. దొంగల్లో ప్రకాశం జిల్లా బాపట్ల చెందిన శివశంకర్‌తో పాటు అతని మిత్రుడు వెంకటేశ్వర్లు, మిట్టపల్లి గ్రామం చెందిన పులి వరప్రసాద్, చీరాలకు చెందిన పాల్‌రాజుగా గుర్తించినట్లు వివరించారు. వీరందరూ తాగుడుకు బానిసలై ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో దొంగతనాలు చేస్తున్నట్లు తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్దనున్న గొర్రెలతోపాటు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎఎస్ఐలు రమణారెడ్డి, కిషోర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని చిన్నంపల్లివాండ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడ్డాడు. శ్రీనివాసులు, నవీన్ అనే వ్యక్తులు ద్విచక్రవాహనంలో తనకల్లు గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి మరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటికుంటలో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో రెడ్డి వారి వీధికి చెందిన బీబీ జాన్ (83) మంగళవారం రావికుంటలో పడి మృతిచెందినట్లు సిఐ శేఖర్ తెలిపారు. బీబీజాన్‌కు గత కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. మంగళవారం ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిందని చెప్పారు. మృతురాలి మనవడు అన్సర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పరు బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కదిరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ హమాలీ కొటర్స్‌లో నివాసమున్న నారాయణ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు హరి ప్రసాద్ తన వంతుగా మృతురాలి దహన సంస్కారాలు కోసం 10వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డిని మండలంలోని అల్లాపల్లి గ్రామపంచాయతీకి చెందిన తెలుగుదేశం నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐను కలిసి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, రాజగోపాల్, గౌనిపల్లి స్టోర్ డీలర్ శివనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ పూజారిరమణ, పూజారి సుధాకర్, గౌనిపల్లి జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ మావిటి రాజేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని పుట్టపర్తి నియోజకవర్గ సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. పుట్టపర్తి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి సబ్ డివిజన్ డీఎస్పీ విజయ్ కుమార్, రూరల్ ఎస్ఐ లింగన్నతో పాటు పోలీస్ అధికారులు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి నియోజకవర్గంలో శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. జూదం, మట్కా, అక్రమ మద్యం, గంజాయి, అక్రమ ఇసుక, అక్రమ రేషన్ లాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని సూచించారు. ప్రజలు ప్రశాంతంగా ఉండేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండి పనిచేయాలని పేర్కొన్నారు.